ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 35.4
కనిష్ఠం 23.4

ANDHRAJYOTHY



యాదాద్రి భువనగిరి

5

మంగళవారం 25 జూన్ 2024

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	504.30 (122.1967)	నిల్	800
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	637.70 (2.71)	78.39	78.39
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	94.32 (0.39)	నిల్	నిల్

చికెన్ ధరలు | లైవ్ : రూ.158 | డ్రెస్ : రూ.240 | స్కిన్‌లెస్ : రూ.270

● పోరుబాట



స్టైఫండ్‌ను నెలనెలా చెల్లించాలని, మెడికల్ కళాశాలల్లో అన్నిరకాల సదుపాయాలు కల్పించాలని, నూతనంగా నిర్మించిన మెడికల్ కళాశాల భవనాన్ని వెంటనే ప్రారంభించి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నల్లగొండ జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రి జూనియర్ డాక్టర్లు సోమవారం విధులను బహిష్కరించారు. అత్యవసర సేవలను మినహాయించి వార్డు, ఓపీ, ఇతర సేవలను బహిష్కరించి ఆస్పత్రి ఆవరణలో బైఠాయించి నిరసన తెలిపారు.

•7లో..



డీఎస్సీని మూడు నెలలు వాయిదా వేయాలని, గ్రూప్-2, 3లో పోస్టుల సంఖ్య పెంచాలని, గ్రూప్-1లో 1:10 ప్రకారం అభ్యర్థులను మెయిన్స్ పరీక్షకు పిలవాలని, ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీలతో ఏర్పడిన ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగులు సోమవారం నల్లగొండలో ఆందోళన నిర్వహించారు. అదేవిధంగా మెగా డీఎస్సీ నిర్వహించాలని కోరుతూ బీజేవైఎం నాయకులు స్థానిక సుభాష్ సెంటర్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు.

•7లో..



అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా అంగన్‌వాడీలకు రూ.18వేలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద సోమవారం ఆందోళనలు నిర్వహించారు. అంగన్ వాడీ టీచర్లకు ఉద్యోగ విరమణ ప్రయోజనాలు రూ.10లక్షలు, హెల్పర్లకు రూ.5లక్షలు ఇవ్వాలని నాయకులు డిమాండ్ చేశారు.



పేదల సొంతింటి కల నెరవేరడంలేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించి, ఎన్నికల ముందు పేదలకు హడావుడిగా పంపిణీ చేసింది. అయితే ఇళ్లను నిర్మించిన ప్రాంతంలో మౌలిక వసతులు లేకపోవడం, కొన్ని ఇళ్లు అసంపూర్తి నిర్మాణాలతో ఉండటంతో లబ్ధిదారులు అక్కడ నివసించలేని పరిస్థితి ఉంది. దీంతో ఆ ఇళ్లు గృహ ప్రవేశానికి నోచుకోక కిటికీలు, దర్వాజాలు, పైప్‌లైన్లు ధ్వంసమయ్యాయి. ప్రస్తుత ప్రభుత్వమైనా స్పందించి వసతులు కల్పించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

- (ఆంధ్రజ్యోతి,యాదాద్రి)

భువనగిరిలో నివాసానికి నోచుకోని డబుల్ బెడ్‌రూం ఇళ్లు

డబుల్ పరేషాన్

- ఇళ్లను నిర్మించి వసతులు మరిచారు
- సౌకర్యాలు లేక గృహప్రవేశానికి నోచుకోని వైనం
- మౌలిక వసతులకు సుమారు రూ.9కోట్లు అవసరం
- జిల్లాకు మంజూరైన ఇళ్లు 3,464
- టెండర్ల పక్రియ పూర్తయిన ఇళ్లు 1,603
- 1,185 ఇళ్లు లబ్ధిదారులకు పంపిణీ

గత ప్రభుత్వం 2016లో డబుల్ ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించింది. జిల్లాకు మొత్తం 3,464ఇళ్లను మంజూరు చేసింది. వీటిలో 1,603 ఇళ్లకు మాత్రమే టెండర్ల ప్రక్రియ పూర్తయింది. మిగతా ఇళ్ల నిర్మాణానికి పలు మార్లు టెండర్లు పిలిచినా, తక్కువ ధరకు నిర్మించలేమని కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. దీంతో ఆ ఇళ్ల నిర్మాణాలు మంజూరు దశలోనే ఉన్నాయి. టెండర్లు పూర్తయిన 1,603 ఇళ్లల్లోనూ 829 నిర్మాణాలు పూర్తి కాగా, మరో 574 ఇళ్లు వివిధ దశలో ఉన్నాయి. పనులు పూర్తయిన చోట్ల మౌలిక వసతులు కల్పించాల్సి ఉండగా, తుది దశలో ఉన్న ఇళ్లకు అంతర్గత పనులైన తాగునీరు, విద్యుత్, సీవరేజ్, తదితర పనులు పూర్తిచేయాల్సి ఉంది. అయితే 1,185 ఇళ్లను గత ప్రభుత్వం లబ్ధిదారులకు పంపిణీ చేసింది. భువనగిరి నియోజకవర్గంలోని భువనగిరి మునిసిపాలిటీలో 444 ఇళ్లు, బీబీనగర్‌లో 11, బీబీనగర్ మండలం కొండమడుగులో 30, పోచంపల్లి మండలం జబ్లిక్‌పల్లిలో 36, ఆలేరు నియోజకవర్గంలోని ఆలేరులో 64, కొలనుపాకలో 64, మోటకొండూరులో 40, ఆత్మకూరులో 48, ఆత్మకూర్(ఎం) మండలం ఉప్పల్‌పహాడ్‌లో 45, యాదగిరిగుట్ట మండలం వంగపల్లిలో 40, మసాయిపేటలో 40, తుర్కపల్లి మండల కేంద్రంలో 40, మునుగోడు నియోజకవర్గంలోని చౌటుప్పల్ మండలం దండుమల్కాపూర్‌లో 72,సంస్థాన్‌నారాయణపురం మండలం సర్వేల్‌లో 64ఇళ్లను లబ్ధిదారులకు గత ప్రభుత్వం పంపిణీ చేసింది.

వసతులు లేక ఇక్కట్లు

డబుల్ బెడ్ ఇళ్ల నిర్మాణానికి నిధుల కొరత, స్థలాల ఎంపికలో తీవ్ర జాప్యం చోటుచేసుకుంది. ఫలితంగా 2016 నుంచి 2022 ఇళ్ల నిర్మాణం కొనసాగుతూనే ఉండగా, నిర్మాణం పూర్తయినచోట వసతులు లేవు. అక్కడక్కడ అరకొరగా నిర్మించిన ఇళ్లను గత ఎన్నికలకు ముందుగా లబ్ధిదారులకు హడావుడిగా పంపిణీ చేశారు. అన్ని సౌకర్యాలు కల్పించిన తరువాతే పేదలకు ఇళ్లను పంపిణీ చేయాల్సి ఉండగా, వసతులు లేకున్నా, ఇళ్ల నిర్మాణం అసంపూర్తిగా ఉన్నా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఇళ్లను నిర్మించి ఏళ్లుగా పంపిణీకి నోచుకోకపోవడంతో భువనగిరితో పాటు పలు ప్రాంతాల్లో ఇళ్ల కిటికీలు, దర్వాజలు, డ్రైనేజీ పైపులు తదితర సామగ్రి ధ్వంసమైంది. లబ్ధిదారులకు ఇళ్లను పంపిణీ చేసిన రెండు నెలలోపు మౌలిక వసతులు కల్పించాల్సి ఉండగా, ఏళ్లు గడుస్తున్నా గత ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో ఇళ్లను పంపిణీ చేసినా అక్కడ లబ్ధిదారులు నివసించలేని పరిస్థితి నెలకొంది. మౌలిక వసతులు కల్పించాలని పలుచోట్ల లబ్ధిదారులు ఆందోళనలు కూడా చేశారు. కలెక్టరేట్‌తో పాటు తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించారు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం దీనిపై స్పందించి డబుల్ బెడ్‌రూం ఇళ్లకు వసతులు కల్పించాలని లబ్ధిదారుల కోరుతున్నారు. అంతేగాక ఈ సమస్యలను లబ్ధిదారులు ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు.



డబుల్‌బెడ్‌రూం ఇళ్లకు వసతులు కల్పించాలని ఆందోళన చేస్తున్న లబ్ధిదారులు (ఫైల్)

మౌలిక వసతుల కల్పనకు రూ.9కోట్లు అవసరం

డబుల్ బెడ్‌రూం లబ్ధిదారుల ఆందోళన నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యేలు అసంపూర్తి పనులకు నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి విన్నవిస్తున్నారు. జిల్లాలో పంపిణీ చేసిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లకు మౌలిక వసతులతోపాటు అసంపూర్తి ఇళ్ల నిర్మాణానికి సుమారు రూ.9కోట్ల మేర నిధులు అవసరమని ఎమ్మెల్యేలు తాత్కాలికంగా అంచనా వేశారు. ఈ మేరకు సంబంధిత అధికారులతో సౌకర్యాల కల్పనపై సమీక్షించి, పూర్తి వివరాలు తీసుకున్నారు. భువనగిరి నియోజకవర్గంలోని సింగన్నగూడ, హుస్సేనాబాద్, కొండమడుగు, బీబీనగర్, రేవణపల్లి, జిబ్లిక్‌పల్లిలోని అసంపూర్తిగా ఉన్న 641 డబుల్ బెడ్‌రూం ఇళ్లకు రూ.4.63కోట్లు అవసరమని అధికారులు నివేదిక రూపొందించారు. ఆలేరు, మునుగోడు నియోజకవర్గాల్లోనూ అసంపూర్తి ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించి, ప్రభుత్వానికి నిధుల మంజూరు కోసం ఎమ్మెల్యేలు నివేదించారు.




మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి నిధులు మంజూరు చేయాలని విన్నవిస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

చిన్నచిన్న మరమ్మతులు చేసినపక్షంలో పేదలు ఇళ్లలోకి వెళ్తారని మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి కలిసి నిధులు మంజూరు చేయాలని కోరారు. మంత్రి కూడా సానుకూలంగా స్పందించినట్టు ఎమ్మెల్యే కుంభం వెల్లడించారు.

నకిలీ సర్టిఫికెట్లతో అక్రమబద్ధీకరణ?

- ఉమ్మడి జిల్లాలో ఎనిమిది మందిపై ఫిర్యాదులు
- సర్టిఫికెట్లు పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆర్జేడీ ఆదేశం
- ఇప్పటికే విచారణ నిర్వహిస్తున్న సీఐడీ అధికారులు



నల్లగొండ, యాదాద్రి జిల్లాల్లోని పలు జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లు నకిలీ సర్టిఫికెట్లతో క్రమబద్ధీకరణ పొందారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై ఇంటర్మీడియట్ బోర్డు ఆర్జేడీకి పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు అందడంతో విచారణకు ప్రభుత్వం ఆదేశించింది.

– నల్లగొండ

గత ప్రభుత్వం రాష్ట్రంలో కాంట్రాక్ట్ జూనియర్ లెక్చర్లను క్రమబద్ధీకరించింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా 10 మంది అర్హత లేకున్నా నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగ క్రమబద్ధీకరణ పొందారనే ఆరోపణలు వచ్చాయి. అందులో ఉమ్మడి జిల్లాలో ఎనిమిది మంది ఉన్నారు. నల్లగొండ జిల్లాలో ఏడుగురు, యాదాద్రి జిల్లాలో ఒకరు ఇలా నకిలీ సర్టిఫికెట్లతో క్రమబద్ధీకరణ పొందినట్టు ఇంటర్ బోర్డుకు పలువురు ఫిర్యాదు చేశారు. వచ్చిన ఆరోపణలపై విచారించిన ఇంటర్మీడియట్ విద్యామండలి ఇప్పటికే ఒక నివేదిక ప్రభుత్వానికి అందజేసినా మరోమారు విచారణకు ఉత్తర్వులు జారీ చేసింది. ఇంటర్మీడియట్ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు(ఆర్జేడీ) సమగ్ర విచారణ నిర్వహించి నివేదిక అందజేయాలని నల్లగొండ, యాదాద్రి జిల్లాల ఇంటర్మీడియట్ విద్యాధికారులను (డీఐఈవో) ఆదేశించింది. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ సమితి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా విచారణకు ఆదేశించినట్టు ఆర్జేడీ తన ఉత్తర్వులో పేర్కొన్నారు. యాదాద్రి జిల్లా రామన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకరు, నల్లగొండ జిల్లా హాలియా జూనియర్ కళాశాలలో ఒకరు, నల్లగొండలోని కేపీఎం జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న మరో అధ్యాపకుడితో పాటు అదే కళాశాలలో పనిచేస్తున్న ఇంకో అధ్యాపకుడు నకిలీ సర్టిఫికెట్లతో క్రమబద్ధీకరణ పొందినట్టు ఆరోపణలు ఉన్నాయి. నాగార్జునసాగర్ విజయపురి కళాశాలలో పనిచేస్తున్న ఒక లెక్చరర్‌తో పాటు నల్లగొండ బాలికల జూనియర్ కళాశాలలో ఒక లెక్చరర్, అదే కళాశాలలో పనిచేస్తున్న మరో ఇద్దరు లెక్చరర్లు నకిలీ సర్టిఫికెట్లతో క్రమబద్ధీకరణ పొందినట్టు ఆర్జేడీకి ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో వారు సమర్పించిన సర్టిఫికెట్లు పరిశీలించి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే ఈ క్రమబద్ధీకరణపై సీఐడీ విభాగం విచారణ నిర్వహిస్తోంది. క్రమబద్ధీకరణ పొందిన అధ్యాపకులు వారి ఒరిజినల్ సర్టిఫికెట్లు డీఐఈవోలకు అందజేయాలని, వాటిని పరిశీలించి ఇస్తామని ఆర్జేడీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో మరి కొంతమంది ఇలా నకిలీ సర్టిఫికెట్లతో క్రమబద్ధీకరణ పొందినట్టు చర్చ సాగుతోంది.

సర్టిఫికెట్లను కమిషనర్‌కు పంపించాం

నకిలీ సర్టిఫికెట్లతో కొందరు కాంట్రాక్ట్ లెక్చరర్లు ఉద్యోగ క్రమబద్ధీకరణ పొందారని ఆరోపణలు ఉన్నాయి. దీంతో వారి సర్టిఫికెట్లను పరిశీలన కోసం ఇంటర్ బోర్డు కమిషనర్‌కు పంపించాం. పూర్తి విచారణ అనంతరం రాష్ట్ర స్థాయి అధికారులు చర్యలు తీసుకుంటారు. ఆరోపణలు ఎదుర్కొంటున వారిలో ఒకరు ఇప్పటికే ఉద్యోగ విరమణ పొందారు.

- దస్రునాయక్, నల్లగొండ డీఐఈవో

భువనగిరిలో ఎన్‌ఎంసీ బృందం పర్యటన

జిల్లా ఆసుపత్రి, పాతకలెక్టరేట్ భవనాల పరిశీలన

వీడియోగ్రఫీ, ఫొటోలు తీస్తూ సాగిన బృందం పరిశీలన



జిల్లా ఆస్పత్రిలో ఎన్ఎంసీ బృందంతో కలెక్టర్ హనుమంతు కే జెండగే

భువనగిరి టౌన్, జూన్ 24 : జిల్లా కేంద్రం భువనగిరిలో ఈ విద్యాసంవత్సరం నుంచి ప్రారంభం కానున్న ప్రభుత్వ వైద్యకళాశాల ఏర్పాట్లను నేషనల్ మెడికల్ కౌన్సిల్(ఎన్ఎంసీ) బృందం సోమవారం పరిశీలించింది. కళాశాల కోసం బోధనాసుపత్రిగా గుర్తించిన జిల్లా ఆసుపత్రిని, కళాశాల ఏర్పాటుచేయనున్న పాత కలెక్టరేట్ భవనాన్ని బృందం సభ్యులు పరిశీలించారు. జిల్లా ఆసుపత్రి భవనంతో పాటు ఆసుపత్రిలో రోగులకు అందుతున్న ఐపీ, ఓపీ సేవలు, ల్యాబ్‌లు, వార్డులు తదితర ప్రతీ విభాగం, అంశాన్ని వీడియో రికార్డింగ్, ఫొటోలు తీసి వివరాలను నమోదు చేసుకున్నారు. అలాగే పాత కలెక్టరేట్ భవనంలో సదుపాయాలు, వసతులను కూడా వీడియోగ్రఫీ ఫొటోల ద్వారా పరిశీలించా రు. జిల్లా ఆసుపత్రి, వైద్య కళాశాల మధ్య దూరం, ప్రయాణ సమయాన్ని లెక్కించారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్(టీవీవీపీ) పర్యవేక్షణలో ఉన్న జిల్లా ఆసుపత్రిని వైద్య కళాశాల బోధనాఆసుపత్రిగా గుర్తిస్తూ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యూకేషన్(డీఎంఈ) పరిధిలోకి రానుండటంతో డీఎంఈ నిబంధనల ఆధారంగా వైద్యులు, సిబ్బంది వివరాలను పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న వైద్యులతో పాటు ఇతర సిబ్బందిని కూడా తాత్కాలికంగా వైద్య కళాశాల, బోధనాసుపత్రిలో డీఎంఈ పరిధిలో పనిచేసేలా వైద్యులు, సిబ్బంది నుంచి లిఖితపూర్వక లేఖలు సేకరించారు.

కళాశాల, బోధనాసుపత్రికి కావాల్సిన సదుపాయాలు, వసతులపై అంచనా వేశారు. వైద్య కళాశాల ఏర్పాటులో ఎన్ఎంసీ బృందం సమర్పించే నివేదికే అత్యంత కీలకం కాగా, ఈనేపథ్యంలో ఎన్ఎంసీ బృందం పరిశీలన, తనిఖీలు అత్యంత పకడ్బందీగా సాగాయి. కలెక్టర్ జిల్లా ఆసుపత్రిలో ఎన్ఎంసీ బృందాన్ని కలిసి అవసరమైన సమాచారాన్ని అందించారు. వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మల్లిఖార్జున్‌రావు, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చిన్నానాయక్ తదితరులు ఎన్ఎంసీ బృందం వెంట ఉన్నారు. ఉదయం ప్రారంభమైన బృందం పర్యటన రాత్రి పొద్దుపోయే వరకూ సాగింది.

ప్రజావాణి ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలి

కలెక్టర్ హనుమంతు కే జెండగే



కలెక్టరేట్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ హనుమంతు కే జెండగే

భువనగిరి అర్బన్, జూన్ 24 : ప్రజలనుంచి ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ హనుమంతు కే జెండగే అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణిలో జిల్లాలోని పలుగ్రామాలనుంచి వచ్చిన ప్రజలు అందించిన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రజావాణి వేదికగా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సమస్యలను పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ పీ బెన్‌షాలోమ్, స్థా నిక సంస్థల అదనపు కలెక్టర్ కే గంగాధర్, జడ్పీ సీఈ వో శోభారాణి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జయశ్రీ, డీపీవో సునంద, మహిళా, శిశు సంక్షేమ అధికారి కృష్ణవేణి, ఎస్సీ కులాల సంక్షేమ అధికారి జినుకల శ్యాంసుందర్, బీసీ సంక్షేమ అధికారి పీ యాదయ్య, కలెక్టరేట్ ఏవో సీ జగన్మోహన్ ప్రసాద్, సూపరింటెండెంట్ పార్థసారథితో పాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

- కొనుగోలు చేసిన 0.27గుంటల భూమిని పాస్‌పుస్తకంలో నమోదు చేయాలని ఆలేరు మండలం పటేల్‌గూడెంనికి చెందిన రైతు బొమ్మకంటి బాలరాజు ప్రజావాణిలో ఫిర్యాదుచేశారు. పొరపాటున తన సోదరుడి పాస్‌పుస్తకంలో నమోదు కాగా తిరిగి తన పాస్‌పుస్తకంలో నమోదు చేయాలని కోరారు.
- వృద్ధాప్య పింఛన్‌దారుల నుంచి బలవంతంగా వసూళ్లకు పాల్పడుతున్న మోటకొండూరు మండల అమ్మనబోలు పంచాయతీ కార్యదర్శిపై పింఛన్‌దారులతో కలిసి గ్రామస్థులు ఫిర్యాదుచేశారు.
- ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు, ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ, చదువుల సౌకర్యం, ఇతర విషయాలపై మోత్కూరుకు చెందిన డిఫెన్స్ వినియోగదారుల హక్కుల సంఘం అధ్యక్షుడు గుమ్మడెల్లి పరశురాం అర్జీ చేశారు. అదేవిధంగా డీఈవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.
- భువనగిరి మండలం హన్మాపురంలో సర్వేనెంబరు 28లోని ప్రభుత్వ భూమిలో పేదలకు ఇళస్థలాల పట్టాలు ఇవ్వాలని సీపీఐ ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏశాల అశోక్ కోరారు.
- అధికఫీజుల నియంత్రణ కోసం జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో డీఈవో, పాఠశాలల యాజమాన్యాలు, తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు, జర్నలిస్టులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో 'ఫీజుల నియంత్రణ కమిటీ' నియమించాలని ఆల్ ఇండియా పేరెంట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొడారి వెంకటేశ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.
- జిల్లా కేంద్రం భువనగిరిలో 444 మందికి కేటాయించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లల్లో వసతులు కల్పించాలని లబ్ధిదారులు వినతిపత్రం అందజేశారు.

తహసీల్దార్‌కు షోకాజ్ నోటీస్

రాజాపేట, జూన్ 24 : రాజాపేట మండల తహసీల్దార్ దామోదర్‌కు సోమవారం కలెక్టరేట్ కార్యాలయం నుంచి షోకాజ్ నోటీస్ జారీ అయింది. ఈ నెల 21న కలెక్టర్ హన్మంతు కే జెండగే తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. కార్యాలయం రికార్డులను పరిశీలించారు. ఈ సమయంలో తహసీల్దార్ విధులకు గైర్హాజరయ్యారు. కలెక్టర్ పర్యటనపై ముందస్తు సమాచారం ఉన్నా దామోదర్ గైర్హాజరు కావడంతో విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఎందుకు గైర్హాజరయ్యారని కలెక్టర్ షోకాజ్ నోటీస్ జారీ చేశారు. ఈ విషయంపై తహసీల్దార్ దామోదర్‌ను వివరణ కోరగా తమ బంధువులు ఒకరు అనారోగ్యానికి గురై అతడి పరిస్థితి సీరియస్‌గా ఉండడంతో తాను విధులకు హాజరుకాలేకపోయానని తెలిపారు.

వాటాదారులుగా అవకాశం కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న చేనేత కార్మికులు

చౌటుప్పల్ టౌన్, జూన్ 24 : చౌటుప్పల్ పట్టణంలోని చేనేత సహకార సంఘంలో వాటాదారులుగా అవకాశం కల్పించాలని చేనేత, అనుబంధ కార్మిక సంఘం అధ్యక్షుడు కర్నాటి జనార్దన్, ప్రధాన కార్యదర్శి గంజి శ్యాంసుందర్ కోరారు. ఈ మేరకు సోమవారం చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్‌రెడ్డికి కార్మిక సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. గత 20 ఏళ్లుగా చేనేత వృత్తిని నమ్ముకొని జీవిస్తున్నామని, సంఘంలో వాటా ధనాన్ని ఇప్పించి నేత పనులకు అవకాశం కల్పించాలని వారు కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘం ప్రతినిదులు సుంకి రవికుమార్, గర్దాసు సత్యనారాయణ, జల్లా చంద్రమౌళి, బడుగు రాంప్రసాద్, పెండెం పురుషోత్తం ఉన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో బాలికలదే పైచేయి

నల్లగొండ, జూన్ 24 : ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో నల్లగొండ జిల్లాలో బాలికలు పైచేయి సాధించారు. మే, జూన్ నెలలో నిర్వహించిన ఈ పరీక్షల ఫలితాలను సోమవారం విడుదలచేశారు. ప్రథమ సంవత్సరం జనరల్ విభాగంలో 7,459 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 4,962 మంది(66.52శాతం) ఉత్తీర్ణత సాధించారు. బాలుర విభాగంలో 3,685మందిలో 2,230 మంది (60.52 శాతం), బాలికల విభాగంలో 3,774మందికి 2,732మంది(72.39శాతం) ఉత్తీర్ణులయ్యారు. అదేవిధంగా ప్రథమసంవత్సరం ఒకేషనల్ విభాగంలో 1,007 మంది విద్యార్థులకు 605మంది(60.08శాతం) ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 3,994మంది విద్యార్థులకు 2,286మంది(57.24 శాతం) ఉత్తీర్ణులయ్యారు. బాలుర విభాగంలో 2,350మందికి 1338మంది(56.94శాతం) ఉత్తీర్ణులయ్యారు. బాలికల విభాగంలో మొత్తం 1644 మందికి 948మంది (57.66 శాతం)ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయసంవత్సరం ఒకేషనల్ విభాగంలో మొత్తం 848కి 481 మంది(56.72శాతం) ఉత్తీర్ణులయ్యారు.

ప్రభుత్వ కళాశాల విద్యార్థిని ఇందుకు రాష్ట్ర స్థాయి ర్యాంక్



రేఖా ఇందు తోట సంజన జీ సృజన పీ వెంకటేష్

హుజూర్‌నగర్ :సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ర్యాంకు సాధించారు. ఎంపీసీ విభాగంలో రేఖా ఇందు 470 మార్కులకు 466 మార్కులతో రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించింది. అదేవిధంగా తోట సంజన 466/470, పిల్లుట్ల వెంకటేష్, ఒకేషనల్ కోర్సులో 458/500, జి.సృజన హెచ్ఈసీలో 439/500 మార్కులు సాధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను డీఐఈవో జే కృష్ణయ్య, ప్రిన్సిపల్ వీడీఎస్ ప్రసాద్, అధ్యాపకులు అభినందించారు.

పిశాటిగూడెంలో చైన్‌స్నాచింగ్

చిట్యాల రూరల్, జూన్ 24:మిట్టమధ్యాహ్నం వృద్ధురాలి మెడలోని పుస్తెలతాడు చోరీ జరిగింది. ఈఘటన నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు పరిధిలోని పిశాటిగూడెంలో సోమవారం జరిగింది. ఎస్ఐ డీ సైదాబాబు తెలిపిన వివరాల ప్రకారం ఏపూర్ గ్రామపరిధిలోని పిశాటిగూడెం గ్రామానికి చెందిన పిశాటి సుగుణమ్మ తన కుమారుడు, కోడలు పొలా నికి వెళ్లగా ఆమె ఇంటి వద్ద ఆరు బయట కూర్చుంది. గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి తాగేందుకు మంచినీరు ఇవ్వాలని అడిగారు. అయితే మంచినీళ్లు లేవని చెప్పి, ఆమె తన నివాసంలోకి వెళ్లి మంచంపై నిద్రకు ఉపక్రమించింది. కాసేపట్లోనే ఇద్దరు దొంగలు నివాసంలోకి చొరబడి సుగుణమ్మ తలను ఒకరు పట్టుకోగా మరొకరు మెడలోని పుస్తెలతాడును లాక్కెళ్లారు. సుగుణమ్మ భయంతో అరుస్తూ బయటకు రాగా అప్పటికే దొంగలు పరారయ్యారు. స్థానికులు డయల్- 100కు ఫోన్ చేయగా చిట్యాల పోలీసులు విచారణ చేపట్టారు. దొంగతనం చోరీ చేసిన పుస్తెలతాడు సుమారు మూడు తులాలకుపైగా ఉంటుందని తెలిసింది. సుగుణమ్మ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

నిడమనూరు, జూన్ 24:నల్లగొండ జిల్లా నిడమనూరు మండల కేంద్రంలో ఓ వివాహిత అదృశ్యమైంది. ఎస్ఐ గోపాల్‌రావు తెలిపిన వివరాల ప్రకారం నిడమనూరు గ్రామానికి చెందిన గాజుల చంద్రమౌళి కుమార్తె భగవతి(37)కి హైదరాబాద్‌లోని రామంతాపూర్ ప్రాంతానికి చెందిన మర్రి రవి రాజుతో 19ఏళ్ల కిందట వివాహం జరిగింది. గత నెల 19వ తేదీన భార్యాభర్తలు గొడవపడటంతో భగవతి పుట్టింటికి వచ్చి ఉంటుంది. ఈక్రమంలో ఈ నెల 21వ తేదీన బయటకు వెళ్లిన భగవతి మూడు రోజుల వరకు కూడా ఇంటికి రాలేదు. అత్తింటితో పాటు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో విచారించినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో తన కుమార్తె కనిపించడం లేదని భగవతి తండ్రి చంద్రమౌళి సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. కాగా భగవతి గతంలో కూడా ఓసారి అదృశ్యమై ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో లభించిందని పోలీసులు తెలిపారు.

పాతబడితో భయం భయం

▸▸ పాత భవనంలో కొనసాగుతున్న చింతకుంట్ల పాఠశాల ▸▸ కొత్త భవన నిర్మాణ పనులు ప్రారంభించని వైనం



పాతబడిన తరగతి పైకప్పు



చింతకుంట్లలోని హైస్కూల్

కొండమల్లేపల్లి, జూన్ 24: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించడానికి గత ప్రభుత్వం నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలంలో కొన్ని స్కూళ్లను ఎంపిక చేసి మన ఊరు మన బడి పథకం కింద నిధులు మంజూరు చేసింది. కొండమల్లేపల్లి మండల పరిధిలోని చింతకుంట్ల ప్రైమరీ హై స్కూల్ భవనం పాత బడడంతో భవనాన్ని కూల్చివేసి కొత్త భవనం నిర్మించడానికి 2022లో 'మన ఊరు మన బడి' పథకం కింద రూ.38.78లక్షలతో అప్పటి ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ శంకుస్థాపన చేశారు. రెండు సంవత్సరాలు గడుస్తున్నా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఇప్పటి వరకు ఎలాంటి పనులు చేపట్టలేదు. దీంతో పాత భవనంలోనే అర కొర వసతులతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం వచ్చినప్పుడు పాఠశాల మొత్తం కురుస్తుంది. విద్యార్థుల బ్యాగులు, పుస్తకాలు తడుస్తున్నాయి. పాఠశాల భవనం పాతది కావడంతో గోడలు మొత్తం వర్షానికి తడిసి ఎప్పుడు కూలుతాయోనని భయంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటున్నారు. వంటగది కూడా చిన్నదిగా కావడంతో చిన్నారులు భోజనం వడ్డించే సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎలాంటి ప్రమాదం జరగకముందే విద్యార్థుల సౌకర్యార్థం కోసం పాత బిల్డింగ్‌ను కూల్చివేసి కొత్త బిల్డింగ్ నిర్మాణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాం

పాఠశాల భవనం పాతబడటంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్న మాట వాస్తవమే. ఈ విషయాన్ని అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి చాలాసార్లు తీసుకెళ్లాం. వర్షం వచ్చినప్పుడు పాఠశాల భవనం మొత్తం వర్షంతో కురుస్తుంది. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కొత్త భవన నిర్మాణ పనులు ప్రారంభించి త్వరితగతిన చేపట్టాల్సిన అవసరముంది.

- విజయ ప్రెస్లీ, ప్రైమరీ స్కూలు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, చింతకుంట్ల

నిధులు మంజూరు కాక పనులు మొదలు కాలేదు

నిధులు రాకపోవడంతో భవనం నిర్మాణపనులు ప్రారంభించలేదు. ఉన్నతాధికారులతో మాట్లాడి కొత్త భవన నిర్మాణం త్వరలో ప్రారంభిస్తాం. అలాగే వంటగది పెద్దగా నిర్మాణం చేయాలంటే అక్కడ హై స్కూలు ప్రైమరీ స్కూలు ఒకే చోటు ఉండటంతో స్థలం ఎక్కువగా లేకపోడంతో నిర్మాణం చేపట్టలేదు.

- ధర్మేంద్ర, పంచాయతీరాజ్ అధికారి.

బడి మార్చారు.. భవనం మరిచారు

▸▸ జూనియర్ కళాశాల రేకుల గదుల్లో తరగతుల నిర్వహణ ▸▸ పాఠశాల భవన నిర్మాణానికి నిధులు మంజూరై ఏడాది





జూనియర్ కళాశాలలోని పాత ఫర్నీచర్ గదిలో చదువుకుంటున్న విద్యార్థులు, పాఠశాల ముందు నిలిచి ఉన్న వర్షపు నీరు

భానుపురి, జూన్ 24: సూర్యాపేట జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలోని పాఠశాల భవనం పాతది కావడంతో దానిని కూల్చేశారు. సంవత్సరం క్రితం నిధులు మంజూరైనా పనులు పూర్తి కావడం లేదు. పాత భవనాన్ని కూల్చివేసి రెండున్నర సంవత్సరాలు అవుతు న్నా ఇప్పటి వరకు పనులు మొదలు పెట్టలేదు. జూనియర్ కళాశాలకు సంబంధించిన రేకుల గదుల్లోకి పాఠశాలను మార్చారు. 90 మంది విద్యార్థులు విద్యనభిస్తున్నారు. రేకుల గదు ల్లో కరెంటు లేకపోతే ఫ్యాన్లు తిరిగే పరిస్థితి లేదు. ఉక్కపోత విపరీతంగా ఉండడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులకు గురవుతున్నారు. దీనికి తోడు ఈ గదుల్లో పాత ఫర్నిచర్ వేయడంతో ఇబ్బంది పడుతున్నట్లు విద్యార్థులు చెబుతున్నారు. వర్షం వస్తే జూనియర్ కళాశాల ప్రాంగణంలోని నీరంతా ఈ రేకుల గదుల ముం దు నిల్వ ఉంటుంది. వారం రోజుల వరకు బురదమయంగా ఉంటోంది. నీరు నిల్వ ఉండడంతో దోమలు వ్యాప్తి చెందుతాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జూనియర్ కళాశాల ప్రాంగణంలోనే క్రీడల కోసం మట్టిపోసి చదును చేయడం వల్ల పాఠశాల ప్రాంగణం వైపు ఒంపు ఉండి నీరు నిల్వ ఉంటోంది. కొత్త పాఠశాల భవనం నిర్మాణానికి సంవత్సరం క్రితం నిధులు మంజూరైనా కాంట్రాక్టర్లు పనులు మొదలు పెట్టలేదు. ఎమ్మెల్సీ కోటా నిధులు రూ.55 లక్షలు మంజూరైనా పాఠశాల నిర్మాణంలో జాప్యం జరుగుతోంది. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జక్కి ఆంధ్రయ్య తెలిపారు. నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూస్తామన్నారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య



మహేష్(ఫైల్)

భువనగిరి రూరల్, జూన్ 24: కుటుంబకలహాలు, అనారోగ్యంతో బాధపడుతూ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం చీమలకొండూరులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పల్లెర్ల మహేష్(23) కడుపునొప్పితో బాధపడుతున్నాడు. అదేవిధంగా కుటుంబ కలహాల నేపథ్యంలో ఆదివారం సాయంత్రం కల్లులో పురుగుల మందు కలుపుకొని తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. అపస్మారక స్థితిలో పడి ఉండగా గమనించిన కుటుంబసభ్యులు 108అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మహేష్ తండ్రి ఎల్లయ్య సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

విద్యుదాఘాతంతో కోడె మృతి



కోడె కళేబరం వద్ద విలపిస్తున్న రైతు

మోత్కూరు, జూన్ 24: మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలోని ఆరెగూడెం గ్రామంలో బద్దం యాదిరెడ్డికి చెందిన కోడె విద్యుదాఘాతంతో మృతిచెందింది. రైతు యాదిరెడ్డి ఆదివారం సాయంత్రం కోడెను మేత మేయడానికి పొడవైన తాడుతో మరో రైతు వ్యవసాయ క్షేత్రంలో కట్టివేశాడు. ఆ కోడె మేత మేస్తూ వెళ్లి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తీగలకు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందింది. ఆదివారం రాత్రి రైతు కోడెను దొడ్లోకి తోలుకొద్దామని వెళ్లే సరికి కోడె విద్యాదాఘాతంతో మృతిచెందింది. కోడె మృతితో రూ.40వేల నష్టం వాటిల్లిందని రైతు విలపించాడు. ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె ఎత్తు తక్కువగా ఉండటంతో ఈ ప్రమాదం జరిగిందని, నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు.

అడ్డగూడూరు; విద్యుదాఘాతంతో కాడి ఎద్దు మృతిచెందింది. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలంలోని ధర్మారంలో సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన కప్పల వెంకన్నకు చెందిన కాడి ఎద్దు గ్రామంలోని కాటమ్మయ్య గుడి సమిపంలో మేపుతుండగా సమీపం లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కిందికి ఉండటంతో ఫేజ్ వైర్ తగిలి అక్కడిక క్కడే మృతి చెందింది. ఎద్దు విలువ సుమారు రూ.60వేలు ఉంటుందని రైతు తెలిపారు.

25 ద్విచక్ర వాహనాలు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

దేవరకొండ, జూన్ 24: జడ్చర్ల-నాగార్జునసాగర్ రహదారి, దేవరకొండ పట్టణంలోని మీనాక్షి సెంటర్‌లలో సోమవారం పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో నెంబరుప్లేట్లు, ధ్రువీకరణ పత్రాలులేని 25 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపారు. వాహనాల పత్రాలు తీసుకొస్తే వాహనాలను అప్పగిస్తామన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు. ఈ తనిఖీల్లో దేవరకొండ ఎస్ఐలు వెంకటయ్య, సైదులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో ఆయిల్ చోరీ

తిప్పర్తి, జూన్ 24: గుర్తుతెలియని వ్యక్తులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో ఆయిల్ చోరీ చేశారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా తిప్పర్తి మండల పరిధిలోని పెద్దసూరారం గ్రామ శివారులో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 21వ తేదీ రాత్రి జాతీయ రహదారి వెంట ఉన్న రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో గుర్తుతెలియని వ్యక్తులు 360 లీటర్ల ఆయిల్‌ను చోరీ చేశారు. విద్యుత్ ఏఈ రమ్య సోమవారం తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయిల్ విలువ సుమారు రూ.45 వేల వరకు ఉంటుందని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి. రాజు తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది.. రైలు కిందపడి

బీబీనగర్, జూన్ 24: మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండలకేంద్రంలో సోమవారం జరిగింది. పట్టణ పరిధిలోని రంగా పురం గ్రామానికి చెందిన తుమ్మల నరేందర్‌రెడ్డి అలియాస్ రాజిరెడ్డి (55)తన భూమి విషయంలో ఓ రియల్ ఎస్టేట్ సంస్థతో కొంత కాలంగా వివాదం కొనసాగుతోంది. దీంతో కొంతకాలంగా మానసిక క్షోభకు గురై మద్యానికి బానిసయ్యాడు. సోమవారం ఉదయం ఇంటికి సమీపంలో ఫ్లైఓవర్ బ్రిడ్జిపై మార్నింగ్ వాక్‌కు వెళ్లి ఇంటికి చేరుకున్న నరేందర్‌రెడ్డి టీ తాగి ఇంటి నుంచి బయటికి వెళ్లాడు. రైల్వేస్టేషన్ సమీపంలో కూతవేటు దూరంలో ఉన్న రైల్వే ట్రాక్‌పై వెళ్లి 225/28-30 మైలు రాయి వద్ద దిగువ లైన్ పై గుర్తుతెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామ నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. రాజిరెడ్డికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. కుటుంబసభ్యులఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సత్యనారాయణ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి..

ఆలేరు రూరల్: రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి(40) మృతి చెందినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఏ. సత్యనారాయణ తెలిపారు. సోమవారం ఉదయం 6.45 సమయంలో ఆలేరు రైల్వే స్టేషన్ ఓం సిగ్నల్ కిలో మీటర్ నెంబర్ 263/19 పెంబర్తి ఆలేరు మధ్య గుర్తుతెలియని మృతదేహం పడిఉంది. మృతదేహంపై బ్లూ బ్లాక్ చెక్స్ షర్ట్ బ్లాక్ రంగు షార్ట్ ఉందని, మెడలో నల్లదారం ఉంది. మృతదేహన్ని భువనగిరిలోని ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఆచూకీ కోసం సెల్: 8712568454, 9100742260 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఉమ్మడి జిల్లాలో నిరసనల హోరు

● నల్లగొండ ఆస్పత్రి ఆవరణలో జూనియర్ డాక్టర్ల నిరసన, ధర్నా ● సూర్యాపేట, భువనగిరి యాదాద్రి జిల్లాల్లో ప్రజా సంఘాల ఆందోళనలు

నల్లగొండ టౌన్, జూన్ 24: ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి జూనియర్ డాక్టర్లు నిరవధిక సమ్మెబాట పట్టారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం అత్యవసర సేవలను మినహాయించి వార్డు, ఓపీ, ఇతర సేవలను బహిష్కరించి ఆస్పత్రి ఆవరణలో బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మెడికల్ కళాశాల జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్‌కె.అబ్దుల్ సమద్, ప్రధాన కార్యదర్శి గగన్, పెరుమాళ్ల మాట్లాడుతూ జూనియర్ డాక్టర్లకు స్టైఫండ్‌ను నెలనెలా చెల్లించాలని, మెడికల్ కళాశాలలో అన్నిరకాల సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. నూతనంగా నిర్మించిన మెడికల్ కళాశాల భవనాన్ని వెంటనే ప్రారంభించి తమ సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రభుత్వాలు కొన్నేళ్లుగా స్కాలర్‌షిప్‌లను మంజూరు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, వెంటనే స్కాలర్‌షిప్‌లకు అవసరమైన ప్రత్యేకమైన నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రి క్యాజువాలిటీలో ప్రత్యేకంగా ఏసీలు లేకపోవడం, అత్యవసర మందులు లేకపోవడంతో రోగులకు సరైన వైద్యం అందించలేకపోతున్నామన్నారు. వెంటనే ప్రభుత్వ స్పందించి అత్యవసర మందులను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. విధుల్లో ఉన్న వైద్యులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. పీజీ డాక్టర్లకు సరైన వసతులు కల్పించకపోవడంతో తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సూపర్ స్పెషాలిటీ డాక్టర్లకు వేతనాలు పెంచాలన్నారు. ఆస్పత్రుల్లో వైద్యుల రక్షణ కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నిత్యానందకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ డాక్టర్లు రుత్విక, సత్యసాయికృష్ణ, రేవంత్, జాన్సీ, బాలు వేమిరెడ్డి, శ్రీనిధి, హరీష, రషీద, దీపిక, శ్రీవల్లి, కేవీ భరత్, మమత, ఇంద్రాణి, దినేష్, శివ కుమార్, సంతోష్ బాబు, రమేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల వేతనాలు పెంచాలి

అంగన్‌వాడీల వేతనాలు రూ.18 వేలకు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా తక్షణమే వేతనాలు పెంచాలని ఏఐటీయూసీ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు పల్లా దేవేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం నల్లగొండ కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీలు పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. గత ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించకుండా తీవ్రఇబ్బందులకు గురిచేసిందని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా 2023 సెప్టెంబరు 11 నుంచి అక్టోబరు 4 వరకు 24 రోజుల సమ్మె చేస్తే గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అంగన్‌వాడీల సమస్యల పరిష్కరిస్తామని హామీ ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో చేర్చిన విధంగా తక్షణమే రూ.18 వేల చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లాప్రధాన కార్యదర్శి ఎడమ సుమతమ్మ, శాంతకుమారి, కోట్ల శోభ, శాంతాబాయి, సాయి సుజిత, బీ రాణి, అన్నపూర్ణ, ప్రభావతి, అంజలి, రమణ, వణజా, పాల్గొన్నారు.



నల్లగొండలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేవైఎం నాయకులు

బీజేవైఎం ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

నల్లగొండ: మెగా డీఎస్సీ విడుదల చేయలని డిమాండ్ చేస్తూ టీఎస్‌పీఎస్ వద్ద టీఎస్‌పీఎస్ కార్యాలయం వద్ద నిరసన తెలిపిన నిరుద్యోగులపై జరిగిన దాడిని నిరసిస్తూ బీజేవైఎం ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని సుభాస్ విగ్రహం వద్ద రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు వంగూరి రాఖీ మాట్లాడుతూ తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్న నిరుద్యోగులను అరెస్టు చేయడం సిగ్గు చేటన్నారు. ఉద్యోగాలలో మెయిన్స్‌కు 1:100 చొప్పున క్వాలీఫై చేయాలని, గ్రూప్-2,3 ఉద్యోగాల్లో అదనపు పోస్టులను పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి చిల్లంచెర్ల అభిలాష్, నాయకులు సంఘపాక రాంబాబు, భరత్, ముంత సైదులు, కానుగు గోపి, లోహిత్‌రెడ్డి, దుబ్బాక సాయి, గోపిరెడ్డి, వంశీ, నాగరాజు, అనీల్ ఉన్నారు. అదేవిధంగా డీఎస్సీని మూడు నెలల పాటు వాయిదా వేయాలని నిరుద్యోగులు పట్టణంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ నిరుద్యోగ జేఏసీ జిల్లా నాయకులు మేడి కిరణ్, సైమన్, ఎండి.అమీర్, ఎం. రాము తదితరులు పాల్గొన్నారు.

వంట కార్మికులకు రూ.10వేలు ఇవ్వాలి

భువనగిరి అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన వంట కార్మికులకు గౌరవ వేతనం రూ. 10వేలు చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎం.డీ. ఇమ్రాన్ డిమాండ్ చేశారు. యాదాద్రిభువనగిరి కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు సోమవారం నిరసన తెలిపారు. కార్మికులను విధుల నుంచి తొలగించకుండా కొనసాగిస్తూ ప్రైవేట్ వ్యక్తులకు ఈ పథకాన్ని అప్పగించొద్దన్నారు. కార్మికులకు ప్రమాద బీమా వర్తింపజేయాలని, వయస్సు పైబడిన వారికి రూ.5లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని కోరారు. కార్మికులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించి ఏటా రెండు జతల ఏకరూప దుస్తులు, స్లాబ్ ధరలు పెంచడంతో పాటు నిత్యావసర సరుకులు, పౌష్టికాహారం కింద కోడిగుడ్లను ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ హనుమంతు కే. జెండగే, డీఈవో కే. నారాయణరెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమాల్లో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బాగుల వసంత, ప్రధాన కార్యదర్శి ముంతాజ్‌బేగం, నాయకులు సంధ్య, నిర్మల, పద్మ, లక్ష్మీ, అనసూయ, వాణీ, ఆండాలు, క్రిష్ణవేణీ, సుగుణ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



సూర్యాపేట కలెక్టరేట్‌లో నిరసన తెలుపుతున్న మహిళలు

సూర్యాపేట(కలెక్టరేట్): మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ సీఐటీయూ అనుబంధం జిల్లా అధ్యక్షురాలు చెరుకు యాకలక్ష్మి డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో సూర్యాపేట కలెక్టరేట్‌లో సోమవారం జిల్లాకలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు వినతిపత్రం అందజేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం నెలకు రూ.10వేల వేతనం ఇవ్వాలన్నారు. కోడిగుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించాలని, వంటలు చేయడానికి అవసరమైన గ్యాస్ సిలిండర్లను సబ్సిడీపై అందించాలన్నారు. ప్రమాద బీమా, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో గీత, కుమారి, తిరుపతమ్మ, వెంకటమ్మ ఉన్నారు.

65వ నెంబర్ జాతీయ రహదారిపై చోరీ

● కారు డిక్కీలో నుంచి రూ.2.21 లక్షల నగదు అపహరణ ● యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలో ఘటన

చౌటుప్పల్ రూరల్, జూన్ 24: యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలో హైదరాబాద్-విజయవాడ 65వ నెంబరు జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. కారులోని రూ.2.21 లక్షల నగదును చోరీ చేశారు. సోమవారం చౌటుప్పల్ సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం పండ్రేగుపల్లికి చెందిన కాత్రాల ఉపేందర్ ఈ నెల 22న తన నాయనమ్మ తిరుపతమ్మ అనారోగ్యానికి గురికావడంతో ఆమెను తీసుకుని స్నేహితుడు వీరబాబుతో కలిసి కారులో హైదరాబాద్‌కు వెళ్లాడు. అదే రోజు హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రిలో చేర్పించారు. తిరిగి 23వ తేదీ సాయంత్రం గ్రామానికి బయలుదేరారు. ఇదిలా ఉండగా పండ్రేగుపల్లికి చెందిన ఉపేందర్ బంధువులు పాశం పావని, కాత్రాల శ్రీను హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఉపేందర్ గ్రామానికి వెళ్తున్నాడని తెలుసుకుని స్వగ్రామంలోని కుటుంబ సభ్యులకు డబ్బులు ఇవ్వాలని పావని రూ.1.48లక్షలు, కాత్రాల శ్రీను రూ.73వేలు ఇచ్చారు. ఆ డబ్బులు తీసుకున్న ఉపేందర్, స్నేహితుడు వీరబాబుతో కలిసి బయలుదేరారు. మార్గమధ్యలో దిల్‌సుఖ్‌నగర్ వద్ద మరో స్నేహితుడు గోవిందరావుతో కలిసి మద్యం తాగారు. అక్కడినుంచి రాత్రి 8.30 గంటలకు ఖమ్మం బయలుదేరారు. దండుమల్కాపురం జాతీయ రహదారి పక్కన స్వాతి దాబాలో రాత్రి 10గంటలకు టిఫిన్ చేసి కారులోనే నిద్రించారు. డబ్బులు డిక్కీలో పెట్టి గాలి కోసం డోర్లు తెరిచి ఉంచారు. అర్ధరాత్రి రెండు గంటలకు నిద్రలేచిన ఉపేందర్ కారులో ఉన్న నగదు చోరీకి గురైనట్లు గుర్తించి వెంటనే డయల్-100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని హోటల్‌కు సంబంధించి సీసీ ఫుటేజీని పరిశీలించారు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో యాక్టివా ద్విచక్ర వాహనంపై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. ఉపేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

చంపి.. పనిచేసే చోటే పాతిపెట్టి..

● ఎలక్ట్రీషియన్, కూలీ మధ్య ఘర్షణ ● ఎలక్ట్రీషియన్‌ను చంపి పూడ్చిపెట్టి పరారీ ● నాగార్జునసాగర్‌లో ఘటన



మట్టిలో పూడ్చిన రహమాన్ మృతదేహాన్ని బయటికి తీయిస్తున్న పోలీసులు

నాగార్జునసాగర్, జూన్ 24: ఒకరు ఎలక్ట్రీషియన్.. మరొకరు కూలీ.. పనిచేసే చోట ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగి ఘర్షణ పడ్డారు. కోపోద్రిక్తుడైన కూలీ ఎలక్ట్రీషియన్‌ను చంపి పనిచేసే చోటే పూడ్చిపెట్టి పరారయ్యాడు. నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లో శనివారం రాత్రి ఈ సంఘటన జరిగింది. సీఐ బీసన్న తెలిపిన సమాచారం మేరకు వివరా లిలా ఉన్నాయి. నాగార్జునసాగర్‌కు చెందిన పర్వతనేని నాగేశ్వరరావు అలియాస్ పెదబాబుకు స్థానికంగా షాపింగ్ కాంప్లెక్స్ ఉంది. మొదటి అంతస్తును ఓ ప్రైవేట్ పాఠశాలకు లీజుకు ఇచ్చేందుకు నెల రోజులుగా నిర్మాణ పనులు చేయిస్తున్నాడు. హిల్‌కాలనీకి చెందిన ఎలక్ట్రీషియన్ రహమాన్(38)కు సంబంధిత పనులు అప్పగించగా, 10 రోజులుగా అక్కడ పనిచేస్తున్నాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాజమండ్రికి చెందిన శివారెడ్డి రెండు రోజులుగా పెయింటింగ్ పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి శివారెడ్డి, రహమాన్ మధ్య మాటా మాటా పెరిగి ఘర్షణ పడ్డారు. శివారెడ్డి రెహమాన్‌ను బలమైన వస్తువుతో కొట్టి హత్యచేసి పనులు జరుగుతున్న పాఠశాల ఆవరణలోనే మృతదేహాన్ని సిమెంటు బస్తాలో చుట్టి మట్టిలో పాతి పెట్టి అక్కడి నుంచి పరారయ్యాడు. ఆదివారం ఉదయం నుంచి రహమాన్, శివారెడ్డి కన్పించకపోవడంతో పెదబాబు వారి గురించి ఆరా తీశాడు. ఆదివారం ఉదయం పనులు జరుగుతున్న ప్రదేశానికి వెళ్లాడు. అక్కడ రక్తపు మరకలు ఉండడంతో అనుమానంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం బృందాలు వచ్చి పాఠశాల పరిసరాలను, అక్కడ ఉన్న రక్తపు మరకలను పరిశీలించి ఊరి చివరివరకు వెళ్లాయి. సోమవారం ఉదయం ఓ చోట మట్టి వీధి కుక్కలు తవ్వి పీక్కు తింటుండడంతో పోలీసులు అటుగా వెళ్లి చూడగా, మృతదేహం మోకాలు బయటకు కనిపించింది. దీంతో పోలీసులు వెంటనే సీఐ బీసన్న, ఎస్ఐ సంపత్‌లకు సమాచారం ఇచ్చి మునిసిపల్ సిబ్బంది సహకారంతో రహమాన్ మృతదేహాన్ని బయటికి తీయించారు. శివారెడ్డి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపడుతున్నారు.

మృతుడి కుటుంబసభ్యుల ఆందోళన

తమకు న్యాయం చేసిన తర్వాతే రహమాన్ మృతదేహాన్ని బయటకు తీయాలని డిమాండ్ చేస్తూ కుటుంబసభ్యులు నిర్మాణంలో ఉన్న పాఠశాల గేటు ఎదుట బైఠాయించారు. దీంతో పోలీసులు కుటుంబ సభ్యులను పిలిచి, షాపింగ్ కాంప్లెక్స్ యజమానితో మాట్లాడించారు. నష్టపరిహారం కింద కోటి రూపాయలు ఇవ్వాలని మృతుడి కుటుంబ సభ్యులు డిమాండ్ చేయగా, రూ.10లక్షలు చెల్లిస్తానని యజమాని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక కమలా నెహ్రూ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా రహమాన్‌కు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

ఎంకేఆర్ మోడ్రన్ రైస్‌మిల్లర్‌పై కేసు

గరిడేపల్లి, జూన్ 24: సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల పరిధిలోని గడ్డిపల్లి గ్రామంలో గల ఎంకేఆర్ మోడ్రన్ రైస్‌మిల్లు యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఈట సైదులు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ యాసంగి, వానాకాలం వడ్లకు సంబంధించి 15,795 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ ధాన్యం కేటాయించగా మిల్లు యజమాని కరుణాకర్ ప్రభుత్వానికి తిరిగి ఇవ్వకపోవడంతో సివిల్ సప్లయ్ అధికారులు మిల్లును తనిఖీ చేయగా మిల్లులో ధాన్యం నిల్వ లేనట్లు గుర్తించారని తెలిపారు. కాగా ప్రభుత్వానికి సంబంధించి రూ.31.99 కోట్ల విలువగల సీఎంఆర్ ధాన్యాన్ని ప్రభుత్వ ఉత్తర్వులకు విరుద్ధంగా దుర్వినియోగం చేశారని ఎస్ఐ తెలిపారు. దీంతో కరుణాకర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా సివిల్ సప్లయ్ మేనేజర్ రాములు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదుచేసి విచారణ చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

200 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం

కొండమల్లేపల్లి, జూన్ 24: నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండల పరిధిలోని అంగోతుతండా, మేగ్యతండా, జోగ్యతండా, జేత్యతండాల్లో దేవరకొండ ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. మేఘ్యతండాలో 200 లీటర్ల బెల్లంపానకాన్ని ధ్వంసం చేయగా 150 కిలోల పటిక, 15 కిలోల నల్లబెల్లం స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ మల్లేష్, కానిస్టేబుళ్లు స్వామి, వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనయ్య, అనిల్ పాల్గొన్నారు.

బండరాయి మీదపడి కార్మికుడి మృతి

కనగల్, జూన్ 24: ప్రమాదవశాత్తు బండరాయి జారి మీదపడి కార్మికుడు మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని చర్లగౌరారంలో సోమవారం జరిగింది. ఎస్ఐ రామక్రిష్ణగౌడ్ తెలిపిన వివరాలిలా ప్రకారం.. మండలంలోని ఇస్లాంనగర్ గ్రామానికి చెందిన రాయికొట్టు కార్మికుడు షేక్‌నజీర్(31) రోజువారీగా సోమవారం గ్రామ సమీపంలోని చర్లగౌరారం గ్రామ గుట్టకు రాయికొట్టే పనినిమిత్తం తోటి కార్మికులతో కలిసి వెళ్లాడు. మధ్యాహ్నం పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు బండరాయి నజీర్‌పై పడింది. తల వెనుక భాగంలో తీవ్రమైన గాయమైంది. 108 అంబులెన్స్‌లో చికిత్సనిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి అతడిని తరలించగా అప్పటికే మృతిచెందాడని వైద్యులు తెలిపారు. నజీర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పెచ్చులూడిన పైకప్పు.. తప్పిన ప్రమాదం



డీఈఈ టేబుల్, కుర్చీ పక్కన పడిన పైకప్పు శకలాలు

మునుగోడు, జూన్ 24 : నల్లగొండ జిల్లా మునుగోడులోని గ్రామీణ నీటి సరఫరా(ఆర్‌డబ్ల్యూఎస్) సబ్ డివిజనల్ కార్యాలయం భవన పైకప్పు సోమవారం సాయంత్రం సమయంలో పెచ్చులూడిపడ్డాయి. ఆ సమయంలో కార్యాలయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదంతప్పింది. చాలా ఏళ్ల క్రితం నిర్మించిన భవనం శిథిలావస్థకు చేరింది. అదే భవనంలో అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. డీఈఈ ఛాంబరు కుర్చీ, టేబుల్ పైనే పైకప్పు పెచ్చులూడి కిందపడ్డాయి. ఒక్కసారిగా పడడంతో పెద్ద శబ్దం వచ్చింది. దీంతో అప్పుడే విధులు ముగించుకొని బయటకు వెళ్తున్న అధికారులు, సిబ్బంది ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. లోపలికి వెళ్లి చూడగా పైకప్పు పెచ్చులూడి పడిఉన్నాయి. ఈ విషయాన్ని సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని ఏఈ మణికుమార్ తెలిపారు.

రోడ్డు విస్తరణకు శ్రీకారం

- మడిగెల యజమానులకు సమాచారం
- ఎన్‌హెచ్‌-65నుంచి సీతారామ ఆలయం వరకు కొలతలు

చౌటుప్పల్‌ టౌన్‌, జూన్‌ 24: చౌటుప్పల్‌ పట్టణంలోని జాతీయ రహదారి నుంచి చిన్నకొండూరుకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు విస్తరణ చేసే ప్రక్రియకు సోమవారం అధికారులు శ్రీకారం చుట్టారు. మునిసిపల్‌ కమిషనర్‌ ఎస్‌.వెంకటేశ్వరనాయక్‌, ఆర్‌అండ్‌బీ డీఈఈ శైనాజ్‌ ఆధ్వర్యంలో సిబ్బంది చిన్నకొండూరుకు వెళ్లే రోడ్డు వెంట ఉన్న సుమారు 150 వ్యాపార మడిగెల యజమానులకు సమచారాన్ని అందించారు. మడిగెల వెంట అధికారులు, సిబ్బంది తిరుగుతూ యజమానులకు నేరుగా రోడ్డు విస్తరణ పనుల విషయాన్ని తెలిపారు. సంవత్సరం క్రితం ఆర్‌అండ్‌బీ అధికారులు మార్కింగ్‌ చేసిన ప్రాంతం వరకు వారం, పది రోజుల్లో కట్టడాలను తొలగించుకోవాలని, లేని పక్షంలో మునిసిపల్‌ సిబ్బంది రంగంలోకి దిగి కట్టడాలను తొలగిస్తారని అధికారులు వివరించారు.

మొదటి విడతలో..

మొదటి విడతలో 65వ నంబరు జాతీయ రహదారి నుంచి సీతా రామ చంద్ర స్వామి దేవాలయం వరకు 350 మీటర్ల పొడవున ఇరు వైపుల ఉన్న కట్టడాల (వ్యాపార మడిగెలు)కు కొలతలు వేశారు. ఇప్పటికే ఈ రోడ్డును 350 మీటర్ల పొడవున ఏడు మీటర్ల వెడల్పుతో సీసీ



మడిగెల యజమానులతో మాట్లాడుతున్న ఆర్‌అండ్‌బీ డీఈఈ శైనాజ్‌, కమిషనర్‌ వెంకటేశ్వర్‌నాయక్‌


విస్తరణ పనులు చేపట్టనున్న చౌటుప్పల్‌ పట్టణంలోని చిన్నకొండూరు రోడ్డు

నిర్మాణం చేశారు. దీనికి అదనంగా ఇరు వైపుల మూడున్నర మీటర్ల వెడల్పుతో అనగా ఏడు మీటర్ల వెడల్పుతో సీసీ నిర్మాణం చేయనున్నారు. మొత్తంగా 14 మీటర్ల వెడల్పుతో సీసీ రోడ్డు నిర్మాణం జరగనుంది. రోడ్డు మధ్య నుంచి అటు వైపు 33 అడుగులు, ఇటు వైపు 33 అడుగుల వెడల్పుతో రోడ్డు విస్తరణ చేపట్టనున్నారు. మొత్తంగా 66 అడుగుల వెడల్పుతో ఉండే విధంగా ఈ రోడ్డును విస్తరించనున్నారు. ఈ రోడ్డుకు ఇరు వైపులా మురుగు కాలువల నిర్మాణం, డివైడర్‌తో పాటు సెంట్రల్‌ లైటింగ్‌ సిస్టంను ఏర్పాటు చేయనున్నారు. చెరువు నంచి వచ్చే అలుగు నీరు సజావుగా వెళ్లి పోయేలా కాలువల నిర్మాణాలను చేపట్టనున్నారు.

కొందరి ఆమోదం.. మరికొందరి ఖేదం

రోడ్డు విస్తరణ పనులకు గాను 10నుంచి 15 మంది మడిగెల యజమానులు స్వచ్ఛందంగా ఆమోదం తెలిపారు. ఈ విషయాన్ని రోడ్డు విస్తరణ కోసం కొలతలు వేసేందుకు వెళ్లిన మునిసిపల్‌ కమిషనర్‌ వెంకటేశ్వర నాయక్‌, ఆర్‌అండ్‌బీ డీఈఈ సైనాజ్‌లకు యజమానులు తెలిపారు. ఏడాది క్రితం మార్కింగ్‌ పెట్టినప్పటి నుంచి మడిగెలకు రంగులు వేసుకోలేదని, రోడ్డు విస్తరణ కోసం తొలగించే నిర్మాణాలకు రంగులు వేయడం వృథా అని, అలాగే ఉంచామని వారు తెలిపారు. మడిగెలు, భవనాలు దెబ్బతినకుండా ఉండేందుకు మార్కింగ్‌ చేసిన వరకు కట్టడాలను స్వచ్ఛందంగా తొలగించుకుంటామని కొంత మంది యజమానులు తెలిపారు. మరి కొందరు యజమానులు కట్టడాల తొలగింపు చర్యలను వ్యతిరేకించారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండ కట్టడాలను ఎలా తొలగిస్తారంటూ అధికారులను ప్రశ్నించారు. ఆర్‌అండ్‌బీ రోడ్డు స్థలంలో నిర్మాణాలను చేసిన కట్టడాల యజమానులకు నోటీసులను జారీ చేయవలసిన అవసరం లేదని, ఇవి అక్రమ నిర్మాణాల కిందకు వస్తాయని డీఈఈ శైనాజ్‌ స్పష్టం చేశారు. అనవసరపు వివాదాలకు వెళ్లకుండా రోడ్డు విస్తరణ పనులకు సహకరించాలని కమిషనర్‌, డీఈఈలు కోరారు.

ట్రాఫిక్‌జాంతో ఇక్కట్లు

పట్టణంలోని చిన్నకొండూరు రోడ్డులో నిత్యం నెలకొంటున్న ట్రాఫిక్‌ జాంతో వాహనదారులు, పాదాచారులు అనేక ఇక్కట్లను ఎదుర్కోవలసి వస్తోంది. జాతీయ రహదారి నుంచి సుమారు 500 మీటర్ల పొడవునా వ్యాపార సంస్థలు ఉండడంతో పార్కింగ్‌ చేసే వాహనాలతో ట్రాఫిక్‌ జాం అవుతోంది. వాహనాలు ఇటు నుంచి అటు వెళ్లేందుకు అరగంట సమయం పడుతోంది. చౌటుప్పల్‌ నుంచి జిల్లా కేంద్రమైన భువనగిరికి వెళ్లే ఈ రోడ్డు పై వాహనాల రాక పోకలు పెరగడంతో రద్దీ నెలకొంది. ఇక్కడ నెలకొంటున్న ట్రాపిక్‌ సమస్య పోలీసులకు సమస్యగా మారింది. దీనికి రోడ్డు వెడల్పు చేయడం ఒక్కటే పరిష్కారమని పలువురు అభిప్రాయ పడుతున్నారు. రోడ్డు విస్తరణ పనులను శీఘ్రగతిన పూర్తి చేసి రాకపోకలకు మార్గం సుగమమం చేయాలని, ట్రాఫిక్‌జాం సమస్యలను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

50 సంవత్సరాల భవిష్యత్‌కు అనుగుణంగా

50 సంవత్సరాల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని హైవే నుంచి చిన్నకొండూరుకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు ను 66 అడుగుల వెడల్పుతో విస్తరించేందుకు నిర్ణయించామని మునిసిపల్‌ చైర్మన్‌ వెన్‌రెడ్డిరాజు తెలిపారు. వాస్తవంగా ఈ ఆర్‌అండ్‌బీ రోడ్డును నిబంధనల ప్రకారంగా 100 అడుగుల వెడల్పుతో విస్తరించవలసి ఉందని, వ్యాపార మడిగెలు, నివాస గృహాల యజమానుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని 66 అడుగులకు తగ్గించామని పేర్కొన్నారు. ట్రాఫిక్‌ సమస్యకు పరిష్కారం లభిస్తుందని, చౌటుప్పల్‌ పట్టణం మరింతగా అభివృద్ధి చెందేందుకు అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు. 15రోజుల్లో రోడ్డు విస్తరణ పనులను చేపట్టేందుకు ప్రణాళికను రూపొందించామని తెలిపారు. రోడ్డు విస్తరణ పనులకు ప్రతీ ఒక్కరు సహకరించి పట్టణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.

మౌలిక వసతుల కల్పనకు జడ్పీ నిధులు దోహదం


హెల్త్‌ సబ్‌ సెంటర్‌కు శంకుస్థాపన చేస్తున్న జడ్పీ చైర్మన్‌ సందీ్‌పరెడ్డి

భువనగిరి రూరల్‌, జూన్‌ 24: గ్రామాల్లో మౌళిక వసతుల కల్పనకు జడ్పీ నిధులు దోహదపడుతున్నాయని జిల్లా పరిషత్‌ చైర్మన్‌ ఎలిమినేటి సందీ్‌పరెడ్డి అన్నారు. సోమవారం భువనగిరి మండలంలోని వడపర్తి, వీరవెల్లి గ్రామాల్లో జిల్లా పరిషత్‌ 5వ ఆర్థిక సంఘం రూ.20లక్షల నిధుల చొప్పున ఆయా గ్రామాల్లో నిర్మిస్తున్న ఆరోగ్య ఉపకేంద్రం నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ భవన నిర్మాణాలను నాణ్యతా ప్రమాణాలు పాటించి, సత్వరమే పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ నరాల నిర్మల వెంకట స్వామి యాదవ్‌, జడ్పీటీసీ సుబ్బూరు బీరుమల్లయ్య, ఎంపీటీసీలు కంచి లలిత, ఉడుత శారద, మాజీ సర్పంచ్‌లు, ఎలిమినేటి కృష్ణారెడ్డి, తంగెళ్లపల్లి కల్పన, ఎంపీడీవో సీహెచ్‌ శ్రీనివాస్‌, పీఆర్‌ఏఈ ఎస్‌ ప్రసాద్‌, నాయకులు కంచి మల్లయ్య, కాటిక జంగయ్య, ఉడుత ఆంజనేయులు ఉన్నారు.

బాధితులకు అండగా ఉంటాం: రాజయ్య


ఆర్థిక సాయం అందజేస్తున్న రేషన్‌డీలర్లు, ప్రతినిధులు

భువనగిరి రూరల్‌, జూన్‌ 24: ఆపదలో ఉన్న రేషన్‌డీలర్ల కుటుంబాలను ఆదుకుంటామని రేషన్‌ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎలుగల రాజయ్య అన్నారు. భువనగిరి మండలం బొల్లెపల్లికి చెందిన రేషన్‌ డీలర్ల దీకొండ కృష్ణవేణి భర్త కృష్ణ అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రూ.50వేల నగదు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. జిల్లా రేషన్‌ డీలర్ల ఆధ్వర్యంలో ఇదే స్ఫూర్తితో ఆపదలో ఉన్న డీలర్ల కుటుంబాలను ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సుర్వి వెంకటే్‌షగౌడ్‌, ప్రధాన కార్యదర్శి కొయ్యడ వెంకటేశం, జిల్లా కోశాధికారి ఎడ్ల ఉమాదర్శన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు గంగాదేవి మహేష్‌, యు.రమేష్‌, పి.అశోక్‌, శంకర్‌, సత్యం ఉన్నారు.

డబుల్‌బెడ్‌రూం ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించాలి


ధర్నా నిర్వహిస్తున్న అఖిలపక్ష నాయకులు

భువనగిరి రూరల్‌, జూన్‌ 24: గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం నిరుపేదలకు కేటాయించిన డబుల్‌ బెడ్‌రూం ఇళ్లలో అన్ని వసతులు కల్పించి లబ్ధిదారులకు వెంటనే ఇవ్వాలని అఖిల పక్షం నేతలు డిమాండ్‌ చేశారు. సోమవారం స్థానిక హైదరాబాద్‌ చౌరస్తా నుంచి ర్యాలీగా బయలుదేరి తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. కాంగ్రెస్‌ ప్రభుత్వానికివ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిలపక్షం నేతలు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడుస్తున్నా ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి డబుల్‌ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులకు పంపిణీ చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. వెంటనే మరమ్మతులు చేపట్టి లబ్ధిదారులకు కేటాయించాలని లేనట్లయితే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడి చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్‌ ఎన్‌ అంజిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్షం నాయకులు ఏవి కిరణ్‌, రత్నపురం బలరాం, చింతల కృష్ణయ్య, బట్టు రామచంద్రయ్య, ఏశాల అశోక్‌ బలరాం, శ్రీనివా్‌సరెడ్డి, రహీం, పెంట నర్సింహ, నితీష్‌, సూరజ్‌, సైదులు, సిరిపంగ సుభాష్‌, కొత్త సత్యం, సుధాకర్‌, మంజుల, శ్రీదేవి, పవన్‌ పాల్గొన్నారు.

పారిశుధ్యం పకడ్బందీగా నిర్వహించాలి


సమావేశంలో మాట్లాడుతున్న సుధ

యాదగిరిగుట్ట రూరల్‌, జూన్‌ 24: యాదగిరిగుట్ట 12 వార్డుల్లో పారిశుధ్యం పకడ్బందీగా నిర్వహించాలని స్థానిక మునిసిపల్‌ చైర్మన్‌ ఎరుకల సుధాహేమేందర్‌గౌడ్‌ అన్నారు. సోమవారం స్థానిక మునిసిపల్‌ కార్యాలయంలో పారిశుధ్యం, తాగునీరు, ఇతర సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రధానంగా వృద్ధులు, చిన్నారులకు అంటువ్యాధులు సోకే ప్రమాదం ఉంటుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని సంబంధిత పూర్తి సిబ్బంది అధికారులకు అందుబాటులో ఉంటూ పరిస్థితిని గమనించాలని, వ్యాధులపట్ల ప్రజలను చైతన్యపర్చాలని కోరారు. కార్యక్రమంలో కమిషనర్‌ అజయ్‌కుమార్‌రెడ్డి, వైస్‌ చైర్మన్‌ మేడబోయిన కాటంరాజు, కౌన్సిలర్లు గుండ్లపల్లి వాణిభరత్‌గౌడ్‌, ముక్కెర్ల మల్లే్‌షయాదవ్‌, మౌనికశ్రీధర్‌గౌడ్‌, అరుణరాజేష్‌, సరోజహరీష్‌, అనిల్‌, నాగరాజు పాల్గొన్నారు.

గౌరవ వేతనాన్ని సేవా కార్యక్రమాలకు వినియోగిస్తా


బ్యాంకు కార్యాలయంలో మాట్లాడుతున్న చైర్మన్‌ తడక రమేష్‌

భూదాన్‌పోచంపల్లి, జూన్‌ 24: ది పోచంపల్లి కో-ఆపరేటివ్‌ అర్బన్‌ బ్యాంకు చైర్మన్‌గా తనకు వచ్చే గౌరవ వేతనాన్ని మొత్తాన్ని పేద ప్రజల సంక్షేమం కోసం విద్య, వైద్యం కోసం తడక ఫౌండేషన్‌ ద్వారా సేవా కార్యక్రమాలకు వినియోగిస్తానని పోచంపల్లి బ్యాంకు చైర్మన్‌ తడక రమేష్‌ అన్నారు. సోమవారం ఆయన బ్యాంకు చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బ్యాంకు ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా ఆయా జిల్లాల్లో 10 బ్రాంచ్‌లుగా విస్తరించిందని, మున్ముందు కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా మరిన్ని బ్రాంచ్‌లు విస్తరిస్తామని అన్నారు. కార్యక్రమంలో బ్యాంకు వైస్‌ చైర్మన్‌ భారత రాజేంద్రప్రసాద్‌, డైరెక్టర్లు గుండు కావ్య, కర్నాటి భార్గవి, ఏలె హరిశంకర్‌, రాపోలు వేణు, కొండమడుగు ఎల్లస్వామి, సీఈవో సీతశ్రీనివాస్‌, బ్యాంకు సీనియర్‌ మేనేజర్‌ మధుసూదన్‌ పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలను పూడ్చాలి


మునిపంపులలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

రామన్నపేట, జూన్‌ 24: మండలంలోని మునిపంపుల గ్రామంలో ధ్వంసమైన రోడ్డు గుంతలను వెంటనే పూడ్చాలని సీపీఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం ప్రభుత్వ అధికారులను కోరారు. సీపీఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో పలు చోట్ల రోడ్డు ధ్వంసమై రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగి ప్రమాదాలకు దారి తీస్తోందన్నారు. వెంటనే మండలంలోని రోడన్నింటికీ మరమ్మతులు చేయాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యురాలు జంపాల అండాలు, శాఖ కార్యదర్శి తొలుపునూరి శ్రీనివాస్‌, నాయకులు తాళ్లపల్లి జితేందర్‌, తొలుపునూరి చంద్రశేఖర్‌, జోగుల శ్రీనివాస్‌, ఉంద్రాతి నర్సింహ, ఎండి.మైనోద్దీన్‌, నోముల రమేష్‌, భిక్షం పాల్గొన్నారు.

సీపీఎం పట్టణ కార్యదర్శి వెంకటేష్‌ ఆకస్మిక మృతి

బీబీనగర్‌, జూన్‌24: బీబీనగర్‌ పట్టణ సీపీఎం కార్యదర్శి టంటం వెంకటేష్‌ అకాల మరణం పార్టీకి తీరని లోటని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్‌ అన్నారు. అనారోగ్యంతో ఆదివారం మృతి చెందిన వెంకటేష్‌ కుటుంబాన్ని ఆయనతో పాటు పలువురు సీపీఎం నేతలు సోమవారం వెంకటేష్‌ కుటుంబాన్ని పరామర్శించి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఎం చేపట్టిన ప్రజా ఉద్యమాల్లో వెంకటేష్‌ పాత్ర మరువలేనిదని కొనియాడారు. సీపీఎం నేతలు బట్టుపల్లి అనురాధ, కొండమడుగు నర్సింహ, కల్లూరి మల్లేష్‌, దాసరి పాండు, నర్సింహ, వెంకటేశ్‌, శ్రీనివాస్‌, శ్రీరాములు, శివ, అయిలయ్య, ముత్యాలు ఉన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి


సర్టిఫికెట్లతో విద్యార్థులు

భువనగిరి రూరల్‌, జూన్‌ 24: చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని భువనగిరి రూరల్‌ ఎస్‌ఐ సంతోష్‌కుమార్‌ అన్నారు. జిల్లా కేంద్రంలోని జీనియస్‌, దేదీప్య హైస్కూళ్లలో తైక్వాండో సమ్మర్‌ క్యాంపులు నిర్వహించడంతో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సోమవారం స్థానిక రూరల్‌ పోలీస్‌ స్టేషన్‌ ఆవరణలో సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆత్మరక్షణకు, శరీర దారుఢ్యానికి తైక్వాండో క్రీడలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ కొండ్రెడ్డి శ్రీకాంత్‌, శిక్షకులు ఓరుగంటి రవికుమార్‌, తల్లిదండ్రులు, పోలీసులు ఉన్నారు.

దైవభక్తితో మానసిక ప్రశాంతత


చౌటుప్పల్‌లోని ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

చౌటుప్పల్‌ టౌన్‌, జూన్‌ 24: దైవభక్తితో మానసిక ప్రశాంతత నెలకొంటుందని చౌటుప్పల్‌ మునిసిపల్‌ చైర్మన్‌ వెన్‌రెడ్డి రాజు అన్నారు. స్థానిక పాటిమీది భక్తాంజనేయ స్వామి దేవాలయ సముదాయంలో గల కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ పంచమ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, రుద్ర హోమాలను నిర్వహించారు. మహిళా భక్తులు కుంకుమార్చన చేశారు. కార్యక్రమాల్లో బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు ఊడుగు శ్రీనివాస్‌, రైస్‌ మిల్లర్స్‌ అసోసియేషన్‌ జిల్లా ఉపాధ్యక్షుడు మంచికంటి భాస్కర్‌, దేవాలయ నిర్మాణ దాత సోమవరపు సత్తయ్య, దేవాలయ కమిటీ అధ్యక్షుడు ఎస్‌. నాగరాజు, ప్రధాన కార్యదర్శి ఊడుగు రమేష్‌, మునిసిపల్‌ వైస్‌ చైర్మన్‌ బత్తుల శ్రీశైలం, కౌన్సిలర్లు ఎస్‌.విజయ, పి.శ్రీధర్‌బాబు, ఎండి.బాబాషరీఫ్‌, బొడిగె బాలకృష్ణ,తాడూరి పరమేష్‌, గ్రంథాలయ మాజీ చైర్మన్‌ ఊడుగు మల్లేశం పాల్గొన్నారు.

మోత్కూరు : మోత్కూరు శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 21 నుంచి నిర్వహిస్తున్న స్వామి వారి బ్రహ్మోత్సవాలు సోమవారం సాయంత్రం ముగిశాయి. సోమవారం మహా పూర్ణాహుతి, శ్రీపుష్పయాగం, దేవతోద్వాసన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు కారంపూడి నర్సింహాచార్యులు, అరుణ్‌కుమార్‌, కొప్పుల కరుణాకర్‌రెడ్డి, సోలిపురం చంద్రారెడ్డి, సోమ వెంకటేశ్వర్లు, సోమయ్య పాల్గొన్నారు.

రుణాల రెన్యూవల్‌ మానుకోవద్దు


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏపీజీవీబీ ఫీల్డ్‌ ఆఫీసర్లు నాగరాజు, లక్ష్మణ్‌

మోత్కూరు, జూన్‌ 24: ప్రభుత్వాలు రుణ మాఫీ చేస్తాయని రైతులు రుణాలు రెన్యూవన్‌ చేసుకుండా ఆపితే రుణాలపై అధిక వడ్డీ పడి నష్టపోతారని ఏపీజీవీబీ మోత్కూరు బ్రాంచి ఫీల్డ్‌ ఆఫీసర్లు నాగరాజు, లక్ష్మణ్‌ అన్నారు. సోమవారం మండలంలోని ముశిపట్ల గ్రామంలో నిర్వహించిన అవగాహన సదస్సులో వారు పాల్గొని మాట్లాడారు. పంట రుణాలు తీసుకున్న రైతులు ఏడాదిలోపు రెన్యూవల్‌ చేసుకుంటే 7శాతం వడ్డీ, ఏడాది దాటితే 7నుంచి 14 శాతం వడ్డీ చెల్లించాల్సి వస్తుందన్నారు. డిసెంబరు 9 కటాఫ్‌ తేదీతో ప్రభుత్వానికి రైతుల రుణాల బకాయి జాబితాలు పంపామని, ప్రభుత్వం రుణమాఫీ చేసినపుడు జాబితాలో ఉన్న రైతులందరికి రుణమాఫీ వస్తుందన్నారు. 2018 కి ముందు రుణాలు తీసుకుని రెన్యూవల్‌ చేసుకోకుండా ఉన్నవారికి రుణ మాఫీ వస్తుందో లేదో తెలియడం లేదన్నారు. పంట రుణాలు తీసుకున్న ప్రతి రైతు యేడాది లోపు రెన్యూవల్‌ చేసుకోవాలని కోరారు. ప్రతీ రైతు బీమా చేయించుకోవాలని, మండలంలోని అనాజిపురం గ్రామానికి చెందిన ఒకరు రూ.వెయ్యి చెల్లించి బీమా చేశారని, ఇటీవల ప్రమాద వశాత్తు చనిపోతే అతని కుటుంబానికి రూ.20 లక్షలు వచ్చాయన్నారు. సదస్సులో రైతులు యానాల దామోదర్‌రెడ్డి, మేరుగు యాదగిరి, శ్రీను, పైళ్ల చినవెంకట్‌రెడ్డి, రమేష్‌, జనార్ధన్‌రెడ్డి, కల్లూరి యాదగిరి, ప్రభాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం చరిత్రాత్మకం


సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

సంస్థాన్‌నారాయణపురం, జూన్‌ 24: రైతులకు సంబంధించి ఏక కాలంలో రూ.రెండు లక్షల పంట రుణాలను మాఫీ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమని పలువురు నాయకులు అన్నారు. కాంగ్రెస్‌ ఆధ్వర్యంలో సోమవారం సంస్థాన్‌నారాయణపురం మండల కేంద్రంలో సంబరాలు నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడి రైతులకు అండగా నిలిచింది కాంగ్రెస్‌ ప్రభుత్వమని పేర్కొన్నారు. కార్యక్రములో మండల కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షులు ఏపూరి సతీష్‌, నాయకులు మందుగుల బాలకృష్ణ, ముద్దంగుల నర్సింహా, అక్బర్‌ అలీ ఉప్పల లింగస్వామి, నోముల మాధవ రెడ్డి, కొనరెడ్డి నర్సింహ, జక్కిడి చంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంలో కాంగ్రెస్‌ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు జె.శేఖర్‌రెడ్డి, ఎం.సిద్దులు, పి.మల్లేశం, ఎద్దు వెంకటేశ్వర్లు, కె.హన్మంత్‌, పి.దామోదర్‌రెడ్డి, ఎన్‌.లక్ష్మారెడ్డి, యాదగిరి, స్వామి పాల్గొన్నారు.

వలిగొండ: మండలంలో పలు గ్రామాల్లో రైతు రుణమాఫీపై కేబినెట్‌ నిర్ణయం తీసుకున్నందున కాంగ్రెస్‌ పార్టీ ఆధ్వర్యంలో, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చిట్టెడి జనార్ధన్‌రెడ్డి, నాయకులు బండారు నర్సింహారెడ్డి, ఆవుల స్వామి, సత్యనారాయణ, జగన్‌రెడ్డి, శ్రీరాములు, రాజు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

మోటకొండూర్‌ : మండలంలోని ఇక్కుర్తి గ్రామంలోని న్యూ కాలనీలో మదర్‌ డైరీ చైర్మన్‌ ఎన్నికలు సోమవారం నిర్వహించారు. ఈఎన్నికల్లో గ్రామానికి చెందిన చిరబోయిన రాజయ్య వరుసగా నాలుగో సారి చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

తుర్కపల్లి: తుర్కపల్లి మండలం వేల్పుపల్లి, గందమల్ల కాలనీ పాల సంఘం చైర్మన్ల ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. వేల్పుపల్లి పాల సంఘం చైర్మన్‌గా కాంగ్రెస్‌ పార్టీ యాదగిరిగుట్ట బ్లాక్‌ అధ్యక్షుడు గుడిపాటి మధుసూదన్‌రెడ్డి రెండో సారి ఎన్నికకాగా గందమల్ల కాలనీ పాల సంఘం చైర్మన్‌గా కాంగ్రెస్‌ పార్టీ మండల ఉపాధ్యక్షుడు బొత్త రాములు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చైర్మన్‌ ఎన్నికకు ముందు నూతన డైరక్టర్లను ఎన్నుకున్నారు. ఎన్నికైన చైర్మన్లను సొసైటీ డైరెక్టర్లు, పాల ఉత్పత్తిదారులు, కాంగ్రెస్‌ పార్టీ నాయకులు శాలువాలతో సన్మానించారు.

మోత్కూరు : మండలంలోని పాలడుగు గ్రామ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం చైర్మన్‌గా ముక్కెర్ల మహేష్‌ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చైర్మన్‌ మహే్‌షతో పాటు డైరెక్టర్లుగా వల్లపు వెంకటేశ్‌, ముప్పిడి మల్లేష్‌ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అంతటి నర్సయ్య, వల్లపు సైదులు, ముక్కామల వీరయ్య, దొనకొండ, అంతటి వెంకటయ్య, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

మోత్కూరు : మాదిగ దండోరా ఎమ్మార్పీఎస్‌ ఆవిర్భావ దినోత్సవాన్ని (రజతోత్సవాలను) విజయవంతం చేయాలని మాదిగ యువసేన రాష్ట్ర వర్కింగ్‌ ప్రసిడెంటు క్యాసగళ్ల రమేష్‌ కోరారు. సోమవారం మోత్కూరు అంబేడ్కర్‌ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్‌ ఆవిర్భావ దినోత్సవ సభ కరపత్రాలను ఆయన విడుదల చేసి మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్లలో ఏబీసీడీ వర్గీకరణ చేయాలని పోరాటం ప్రారంభించిన ఎమ్మార్పీఎస్‌ జూలై 7 నాటికి 30 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఎమ్మార్పీఎస్‌ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ ఆధ్వర్యంలో జూలై 7న హైద్రాబాదు రవీంద్ర భారతిలో రజతోత్సవ వేడుకలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కూరెల్ల రాజశేఖర్‌, రాంపాక కరుణాకర్‌, వస్తుప్పుల వినోద్‌, కూరెల్ల ప్రశాంత్‌, సాయి, గణేష్‌, రాజు, నవీన్‌ పాల్గొన్నారు.

మోత్కూరు : మండలంలోని పనకబండ గ్రామ సమీపాన ఉన్న కోళ్లఫామ్‌ను తొలగించాలని గ్రామస్థులు గ్రామ పంచాయతీ కార్యదర్శి రమేష్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు బత్తిని తిరుమలేష్‌, సూదగాని పాండు, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు పొన్నెబోయిన రమేష్‌, లోతుకుంట స్వామి, బి.గోపాల్‌, బి.శేఖర్‌, ఉప్పలయ్య ఉన్నారు.

మోత్కూరు : జిల్లాలోని అన్ని మండలాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో బయోమెట్రిక్‌ హాజరు విధానం అమలు చేయాలని మోత్కూరు కన్స్యూమర్‌ వేల్ఫేర్‌ సొసైటీ అధ్యక్షుడు పోచం సోమయ్య కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. మండలాల్లో కొందరు అధికారులు, సిబ్బంది సకాలంలో ప్రభుత్వ కార్యాలయాలకు రాక పోవడంతో వివిధ పనుల మీద కార్యాలయాలకు వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

మోత్కూరు : మాదక ద్రవ్యాలు కలిగి ఉండటం, వాడటం, రవాణా చేయడం నేరమని, అలాంటి వారు కఠిన శిక్షలు అనుభవించాల్సి వస్తుందని మోత్కూరు ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి హెచ్చరించారు. ఈ నెల 26న అంతర్జాతీయ మాదక ద్రవ్య, మానవ అక్రమ రవాణా నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన సోమవారం మోత్కూరు జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్‌ఎం టిగోపాల్‌రెడ్డి ఆయన వెంట ఉన్నారు.

మోత్కూరు : మండలంలోని పాటిమట్ల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రాజమాత ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాజమాత ఫౌండేషన్‌ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్‌రెడ్డి, మనోజ్‌రెడ్డి, హెచ్‌ఎంలు మిరియాల దామోదర్‌, ప్రవీణ్‌ పాల్గొన్నారు.

'బీర్ల అయిలయ్యకు మంత్రి పదవి ఇవ్వాలి'

భువనగిరి రూరల్‌, జూన్‌ 24: సర్పంచ్‌ స్థాయి నుంచి ఎమ్మెల్యే స్థాయి వరకు ఎదిగి అహర్నిశలు పేదల కోసం కృషి చేస్తున్న ప్రభుత్వ విప్‌ బీర్ల అయిలయ్యకు మంత్రి పదవి ఇవ్వాలని చందుపట్ల మాజీ సర్పంచ్‌ చిన్నం శ్రీనివాస్‌ అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం మండలంలోని చందుపట్లలో కురుమ సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు చెందిన అయిలయ్యకు మంత్రి పదవి ఇచ్చే విధంగా చూడాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశంలో కురుమ సంఘం పెద్దలు సుబ్బురు బీరప్ప, జహంగీర్‌, జిన్న బీరప్ప అయిలయ్య, సాయిలు, పాండు, శ్రీనివాస్‌, ఆంజనేయలు, నరేష్‌ పాల్గొన్నారు.

మోత్కూరు ఉన్నత పాఠశాలకు రూ.లక్ష విరాళం


హెచ్‌ఎం గోపాల్‌రెడ్డికి రూ.లక్ష చెక్కును అందిస్తున్న పూర్వ విద్యార్థి సుదర్శన్‌

మోత్కూరు, జూన్‌ 24: మోత్కూరు జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో డిజిటల్‌ టీవీలు అమర్చిన తరగతి గదులకు గ్రిల్స్‌ డోర్లు చేయించడానికి ఆ పాఠశాల పూర్వ విద్యార్థి, ప్రస్తుత సాఫ్ట్‌వేర్‌ ఇంజనీర్‌ రాపోలు సుదర్శన్‌ సోమవారం రూ.లక్ష (చెక్‌)విరాళంగా అందించారు. తన కుమార్తె నిత్విక పుట్టినరోజు సందర్భంగా తన తండ్రి రాపోలు శేషాద్రి జ్ఞాపకార్థం విరాళం అందిస్తున్నట్టు ఆయన చెప్పారు. ఈ సందర్భంగా రెడ్‌ క్రాస్‌ జిల్లా చైర్మన్‌ డాక్టర్‌ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి మాట్లాడుతూ ఒక స్థాయికి ఎదిగిన వారు తమ పిల్లల పుట్టినరోజు సందర్భంగా పార్టీల పేరుతో డబ్బు వృథా చేయకుండా ఇలాంటి సేవాకార్యక్రమాలకు వినియోగించడం అభినందనీయమన్నారు. పాఠశాలకు రూ.లక్ష విరాళం ఇచ్చిన సుదర్శన్‌ తల్లి సుగుణమ్మను పాఠశాల హెచ్‌ఎం టి.గోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం టి.గోపాల్‌ రెడ్డి, కాంగ్రెస్‌ జిల్లా నాయకుడు పైళ్ల సోమిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు గుండగోని రామచంద్రు, బయ్యని రాజు, వాసవి, నిత్విక, రేవంత్‌ పాల్గొన్నారు.

చట్ట సభల్లో ఆర్యవైశ్యులకు ప్రాతినిధ్యం కల్పించాలి

ఆలేరు రూరల్‌, జూన్‌ 24: చట్ట సభల్లో ఆర్య వైశ్యులకు ప్రాతినిధ్యం కల్పించాలని ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పసుపునూరి వీరేశం డిమాండ్‌ చేశారు. సోమవారం జరిగిన సంఘం సమావేశంలో మాట్లాడారు ఆర్యవైశ్యులు రాష్ట్రంలో 10లక్షలకు పైగా ఉన్నా ఎలాంటి ప్రాతినిధ్యం కల్పించకపోవడం శోచనీయమన్నారు. ఆర్యవైశ్యులు పలు సేవా సంస్థల ద్వారా సేవలందిస్తున్నా తగిన గుర్తింపు లేకుండా పోయిందన్నారు. సమావేశంలో నాయకులు ఐత వెంకటేష్‌, ప్రకాశ్‌, సముద్రాల సత్యం, అశోక్‌, అంజయ్య, శ్రీనివాస్‌, ఉపేందర్‌, మల్లేశం, నాగయ్య ఉన్నారు.

'పీర్లకొట్టం పనులు పూర్తి చేయించడం అదృష్టం'

చౌటుప్పల్‌ టౌన్‌, జూన్‌ 24: చౌటుప్పల్‌ పట్టణంలోని పీర్ల కొట్టం నిర్మాణ పనులను పూర్తి చేయించడం తన అదృష్టమని మునిసిపల్‌ వైస్‌ చైర్మన్‌ బత్తుల శ్రీశైలం గౌడ్‌ అన్నారు. అసంపూర్తిగా ఉన్న స్థానిక పీర్లకొట్టం పనులను బత్తుల శ్రీశైలం గౌడ్‌ తన సొంత డబ్బులతో నిర్మాణం చేయించే పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ మాజీ చైర్మన్‌ ఊడుగు మల్లేశం, మాజీ ఉప సర్పంచ్‌ ఎ.గోవింద్‌రాజ్‌, గౌడసంఘం అధ్యక్షుడు చింతకింది అంజయ్య, గౌడ సంఘం మాజీ అధ్యక్షుడు బత్తుల లక్ష్మయ్య, ఎల్లయ్య, అంజిరెడ్డి, పల్లం సత్యం పాల్గొన్నారు.

అమరుల ఆశయాలు సాధించాలి

సంస్థాన్‌ నారాయణపురం, జూన్‌ 24: అమరవీరుల ఆశయ సాధనకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని సీపీఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్‌ కోరారు. సంస్థాన్‌ నారాయణపురం మండలం మహ్మదాబాద్‌ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్‌ ముత్యాల నరసింహ ప్రథమ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ఆయన స్మారక స్థూపం వద్ద పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో సిపిఐ సీనియర్‌ నాయకులు తోకల రామ్‌రెడ్డి, చిలువేరు అంజయ్య, కలకొండ సంజీవ, ముత్యాల అంజయ్య, భీమనపల్లి గాలయ్య, పల్లె మల్లారెడ్డి, యాదయ్య, ఎట్టయ్య పాల్గొన్నారు.

లయన్స్‌ క్లబ్‌ సేవలను మరింత విస్తరించాలి

చౌటుప్పల్‌ టౌన్‌, జూన్‌ 24: లయన్స్‌ క్లబ్‌ చౌటుప్పల్‌ సేవ ఆధ్వర్యంలో సేవలను మరింతగా విస్తరించాలని సెకండ్‌ వైస్‌ డిస్ట్రిక్‌ గవర్నర్‌ కేవీ.ప్రసాద్‌ అన్నారు. 2024-25 సంవత్సరానికి సంబందించి లయన్స్‌ క్లబ్‌ చౌటుప్పల్‌ సేవా నూతన అధ్యక్షుడు కొసనం రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి తిరందాస్‌ జగన్‌, కోశాధికారి ఎండి.అతహర్‌ పాషాతో సోమవారం కేవీ ప్రసాద్‌ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో లయన్స్‌ క్లబ్‌ ప్రతినిదులు గాదె వినోద్‌రెడ్డి, దాచెపల్లి ప్రకాష్‌, అవ్వారీ శ్రీనివాస్‌, గోళికరుణాకర్‌, పోలోజు శ్రీనివాస్‌ చారి, ఉప్పు ఆంజనేయులు, పోలోజు రాజు, ఎ.ప్రతాప్‌రెడ్డి, ప్రశాంత్‌, చింతల తిరుమల్‌ రెడ్డి, వనం రాజు, మంగయ్య పాల్గొన్నారు.